క్లుప్తంగా

నాణ్యమైన పంటలకు అధిక ధర

ఫిరంగిపురం: తక్కెళ్లపాడు గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏవో వాసంతి మాట్లాడుతూ వరిలో ఎంపిక చేసిన 30 మంది రైతులకు గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ ద్వారా సమగ్ర పంటల యాజమాన్యంపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పత్తి పంట వేసిన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వర్షం తగ్గిన వెంటనే పొలంలో నీటిని తీసివేసి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాషియం వెదజల్లాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



తాడేపల్లిరూరల్: సీతానగరం చిన్నజీయర్ స్వామి ఆశీస్సులతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో గురువారం మహానాడు ప్రాంతంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ వరద ముంపు వల్ల నష్టపోయిన 200 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

కాలువల పరిశీలన

మంగళగిరి: తూములలో పేరుకుపోయిన తూటికాడను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. వర్షాలు కురిసిన నేపథ్యంలో గురువారం నగర పరిధిలోని నీటి పారుదల కాలువలను ఈఈ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ తూములలో పేరుకుపోయిన తూటికాడను తొలగించి రైతుల పంట పొలాలు మునగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పెదవడ్లపూడి మాజీ అధ్యక్షుడు నాగళ్ళ రామకృష్ణ, రైతు సంఘం నాయకులు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, గాదె పిచ్చిరెడ్డి, రమేష్, భీమినేని రాఘవయ్య,యామినేని సుధాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నృసింహునికి రూ.6,74,515 అదనపు ఆదాయం

మంగళగిరి: స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వివిధ రకాల సామగ్రి విక్రయించేందుకు గురువారం జరిగిన బహిరంగవేలంలో రూ.6,74,515లు ఆదాయం అదనంగా సమకూరినట్లు ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి తెలిపారు. ఎగువ సన్నిధిలో కూల్ డ్రింక్స్, వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, షోడాలు, ఐస్‌క్రీమ్స్ విక్రయించుకునే లైసెన్స్ పొందుటకు గత ఏడాది రూ.2,69,999 సమకూరగా ఈ ఏడాది రూ.3,52,019 సమకూరినట్లు తెలిపారు. ఎగువ దిగువ సన్నిధుతోపాటు ఘాట్ రోడ్డుపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పచ్చి కొబ్బరి కాయలు, గుమ్మడి కాయలు ప్రోగు చేసుకునే హక్కుల కోసం గత ఏడాది రూ.4,00,999 సమకూరగా ఈ ఏడాది రూ.1,58,000 పెరిగి రూ. 5,58,999 సమకూరింది. దిగువ సన్నిధిలో కొబ్బరి కాయలు, తులసిమాల, నేతితో చేపిన దీపారాధన ఒత్తులు విక్రయానికి గత ఏడాది రూ.7,51,116 సమకూరగా ఈ ఏడాది రూ.3,01,995 పెరిగి రూ. 10,53,111కు చేరింది.ఎగువ సన్నిధిలో టీ స్టాల్ నిర్వహించుకొను లైసెన్స్ హక్కు గత ఏడాది రూ. 67,509 రాగా ఈ ఏడాది రూ.1,32,500 పెరిగి రూ. 2,00,009ల ఆదాయం సమకూరింది. గత ఏడాది కంటే అదనంగా రూ.6,74,515 సమకూరినట్లు తెలిపారు.

పాడి రైతులకు దాణ, మేత ఉచితంగా ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలో ముంపునకు గురైన లంక పొలాలను గురువారం రైతు సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ముంపునకు గురైన చిర్రావూరు గ్రామ రైతులు, కౌలు రైతులు, పాడి రైతులను కలుసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నామని, రైతుల తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి పశువులకు మేత లేదని, ప్రభుత్వం దాణ, మేత ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు పసుపుకు ఎకరానికి లక్ష రూపాయలు, మాగాణి పంటలకు ఎకరానికి 30 వేలు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాజధాని నాయకులు వీరాస్వామి, బక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







గురుభ్యోనమః





జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న వారు వరుసగా.. తాడేపల్లి ఉర్దూ ఎంపీయూపీఎస్ స్కూల్ అసిస్టెంట్ అబ్దుల్‌షాజీర్, మందడం జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎ.కోటేశ్వరరావు, దుగ్గిరాల జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ బి.నాగకృష్ణకుమారి, పెనుమాక జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ బి.రమేష్‌బాబు, పేరేచర్ల ఎంపీపీఎస్ ఎస్జీటీ టి.సుబ్బారావు, నులకపేట ఉర్దూ ఎంపీయూటీఎస్ స్కూల్ అసిస్టెంట్ షాహిద్ అలీ షేక్, చినకొండ్రుపాడు జెడ్పీటీఎస్ స్కూల్ అసిస్టెంట్ జోసఫ్ సుధీర్‌బాబు, నిడమర్రు జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ షేక్ అనిలా సుల్తానా, దుగ్గిరాల జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎ.పద్మ.

వరద ప్రభావిత కుటుంబాలు 9వేలు

- 13 పునరావాస కేంద్రాల్లో 4,500 మందికి ఆశ్రయం
- మెడికల్ క్యాంపులు ఏర్పాటు
- తుళ్ళూరు మండలంలో పర్యటించిన కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్
- వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ.
- పడవలో పెదలంక గ్రామం సందర్శన



బోటులో పెదలంక పర్యటనకు వెళుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

తాడికొండ: గుంటూరు జిల్లాలో వరద ప్రభావిత కుటుంబాలు తొమ్మిది వేలు గుర్తించామని కలెక్టర్ ఎస్. చెప్పారు. గురువారం తుళ్ళూరు మండలం రాయపూడిలోని మత్స్యకార కాలనీలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆమె పర్యటించారు. వరద బాధిత కుటుంబాలను పరామర్శించారు. 50 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పంచదార, కిలో బంగాళదుంపలు, కిలో పామోలివ్ ఆయిల్, కిలో ఉల్లిపాయలతో కూడిన కిట్‌లను అందజేశారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. వరదల్లో చిక్కుకున్న గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు బోటు ద్వారా తరలించిన అర్థాని బ్రహ్మయ్య, టెమ్మడి సత్తిబాబు, ధర్మాడి ఏసుబాబును సత్కరించి పారితోషికం అందించారు.

కొనసాగుతున్న సహాయక కార్యక్రమాలు

అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. లంక గ్రామాలతోపాటు తాడేపల్లి మండలంలోని మహానాడులోని మూడు వేల ఇళ్లలోకి వరద నీరు వచ్చిందని వివరించారు. వరదలకు గురైన ప్రాంతాల్లో 9 వేల కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించాలని నివేదికలు తయారు చేసినట్టు వెల్లడించారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లాలో 33 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రస్తుతం 10 కేంద్రాలను మూసివేశామని పేర్కొన్నారు. 13 కేంద్రాల్లో నాలుగున్నర వేల మంది ఆశ్రయం పొందుతున్నట్టు వివరించారు.

40 వేల హెక్టార్లలో పంటలకు నష్టం

జిల్లాలో 40 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, ఇందులో వరి 28 వేల హెక్టార్లు ఉన్నట్టు వెల్లడించారు. కోళ్ళు, గేదెలు, మేకలు ఎక్కువగా చనిపోయాయని వివరించారు. 9 వేల పశువులకు 250 టన్నుల పశుదాణా అందించినట్టు చెప్పారు. జిల్లాలో కంట్రోల్ రూమ్ ఇంకా కొనసాగిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వరదలకు రాజధాని మునగలేదని చెప్పారు. బాధితులకు సాయం అందించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ శివన్నారాయణ పాల్గొన్నారు. అనంతరం తుళ్లూరు మండలం పెదలంకలోనూ కలెక్టర్ పర్యటించారు. కొంతదూరం నడిచి వెళ్లిన ఆమె గ్రామస్తులను పరామర్శించారు. తమను పడవల ద్వారా కాకుండా హెలికాఫ్టర్ ద్వారా పునరావాస సహాయక కేంద్రానికి తరలించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహానాడులో జిల్లా కలెక్టర్ పరిశీలన

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మహానాడు ప్రాంతంలో వరద ముంపు ప్రాంతాలను గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి గురువారం పరిశీలించారు. వెంట తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా ఉన్నారు. బాధితులతో మాట్లాడి సాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషా, తాడేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ సతీష్, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తూటాకు తొలగింపు



ఉండవల్లి కొండవీటి వాగు వద్ద వరద ఉధృతికి తూటాకు అడ్డుపడడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు దానిని తొలగించారు. అక్కడే పడేయడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆ తూటాకును తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 200 టన్నులు ఉన్న తూటాకును పెనుమాక యర్రబాలెం మధ్య వున్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు ఇరిగేషన్ సిబ్బంది తెలిపారు.

– తాడేపల్లి రూరల్

వైభవంగా ఉపాధ్యాయ దినోత్సవం



కేఎల్‌యూలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉపాధ్యాయులకు బహుమతులు అందజేస్తున్న వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపల్ తదితరులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సర్వేపల్లి జీవితం నేటి అధ్యాపకులకు ఆదర్శమని, ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, అకడమిక్స్ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, హాబీ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్. సుభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాలలోని డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి. రాఘవరెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు.

మోతడక 'చలపతి'లో

మోతడక(తాడికొండ): తరగతి గదిలో భావిభారత పౌరులను తీర్చిదిద్ది సమాజానికి అందించేది గురువులే అని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు చెప్పారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి, పలు క్రీడలలో గెలుపొందిన ఉపాధ్యాయులకు సతీమణి వై.అనంతకుమారితో కలిసి బహుమతులు అందజేశారు.

జ్ఞానజ్యోతిని వెలిగించేది గురువే

ఫిరంగిపురం: విద్యార్థి జీవితంలో జ్ఞానజ్యోతిని వెలిగించేది గురువేనని హెచ్ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి అన్నారు. సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు పాఠశాలలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని(గురుపూజోత్సవం) నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను పలువురు విద్యార్థులు పూలమాలలు వేసి సన్మానించారు.

మహంకాళి దేవస్థానం నుంచి వాటర్‌ప్యాకెట్లు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని వరద బాధితులకు తాగునీటిని అందజేసేందుకు ఆలయ ఈఓ చినవెంకటరెడ్డి 40 వేల వాటర్ ప్యాకెట్లను దేవస్థానం తరపున అందించారు. ఈ వాహనాన్ని తమ సిబ్బందితో విజయవాడలోని వరద ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలకు అందిస్తున్నట్లు వివరించారు.


ఆహార 'దారి'ద్ర్యం



పడవేసిన ఆహార పదార్థాలు

ఓ వైపు పట్టెడన్నం దొరక్క లక్షలాది మంది వరద బాధితులు అల్లాడుతుంటే.. మరోవైపు ఇలా ఆహారపదార్థాలు రోడ్డు పాలవుతున్నాయి. తాడేపల్లి గుంటూరు చానల్ దారి వెంబడి గురువారం ఈ చిత్రాలు తారసపడ్డాయి. రెండు రోజుల క్రితం కొలనుకొండ వద్ద జాతీయ రహదారి వెంబడి భోజనం ప్యాకెట్లు పడవేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో కథనం రావడంతో ఎంటీఎంసీ అధికారులు వాటిని తొలగించారు. మళ్లీ గురువారం కూడా ఆహారపదార్థాలు రోడ్డుపై కనిపించాయి. విజయవాడ వరద బాధితుల కోసం పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు పంపిస్తున్న ఆహార పదార్థాలను ఎక్కడ ఇవ్వాలో తెలీక కొందరు తిరిగి వెళ్లే క్రమంలో ఇలా రోడ్డుపై పడేస్తున్నారని చెబుతున్నారు.

– తాడేపల్లిరూరల్



గుంటూరు చానల్ వెంబడి జాతీయ రహదారిపై పడవేసిన భోజనం ప్యాకెట్లు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మోతడక(తాడికొండ): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి కాలు విరిగి ఛిద్రమై తీవ్రగాయాలైన ఘటన తాడికొం మండలం మోతడక గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెదకూరపాడు మండలం బుస్సాపురం గ్రామానికి చెందిన పాటిబండ్ల సురేష్ తన పదేళ్ల కుమారుడు అఖిల్‌తో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టడంతో సురేష్ కాలు విరిగి పాదం వద్ద ఛిద్రమైంది. ఘటనలో తీవ్రగాయాలైన యువకుడిని స్థానికుల సాయంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు.




చినకాకాని జాతీయరహదారి వెంట విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథ ప్రతిమలు



సిద్ధమవుతున్న వినాయక మంటపం

భక్త'గణ'ం సిద్ధం

గణపతి నవరాత్రి వేడుకలకు భక్తగణం సిద్ధమైంది. శనివారం వినాయక చవితి సందర్భంగా ఊరువాడా కొలువుదీరేందుకు వివిధ ఆకృతుల్లో గణనాథ ప్రతిమలు, మంటపాలు ముస్తాబవుతున్నాయి. ఆది పూజలు అందుకునే గణేశుని మనసారా కొలిచేందుకు భక్తులు ఉత్సాహంగా నిరీక్షిస్తున్నారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలో 100కుపైగా వినాయక మంటపాలు ఏర్పాటవుతాయని అంచనా వేస్తున్నారు. దీనికోసం ఆటోనగర్ కేంద్రంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కళాకారులు గణపతి ప్రతిమలను తీర్చిదిద్దుతున్నారు. వీరి వద్ద రెండు అడుగుల నుంచి 20 అడుగుల విగ్రహాలు వివిధ రూపాల్లో లభ్యమవుతున్నాయి. విగ్రహం సైజును బట్టి రూ.2వేల నుంచి రూ.20వేల వరకు అమ్ముతున్నారు. మంగళగిరి ఆటోనగర్‌లో తయారయ్యే విగ్రహాలను మంగళగిరి వాసులే కాకుండా గుంటూరు, ఎన్టీఆర్ జిల్లా వాసులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల విగ్రహాల ధరలూ పెరిగాయని కళాకారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఈ ఏడాది వానలు చవితి ఉత్సవాలకు ప్రతిబంధకంగా మారాయి. ఇప్పటికే వర్షాలు, వరదలు విగ్రహాల అమ్మకాలపై ప్రభావం చూపాయని సురేంద్ర అనే కళాకారుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

– మంగళగిరి